అసత్య ప్రచారం.. బీఆర్ఎస్ నైజం

కాంగ్రెస్ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ హకీం



హత్నూరలో విలేకరులతో మాట్లాడుతున్న ఎంఏ హకీం

హత్నూర, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని కాంగ్రెస్ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎంఏ హకీం పేర్కొన్నారు. మండల కేంద్రమైన హత్నూరలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అర్హులైనవారికి రేషన్‌కార్డులు ఇస్తుంటే బీఆర్ఎస్ నాయకులకు కళ్లు మండుతున్నాయని ఎద్దేవా చేశారు. అధికారిక కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తే ఎమ్మెల్యే సునీతారెడ్డికి ఎందుకు అభ్యంతరమని ప్రశ్నించారు. సునీతాలక్ష్మారెడ్డికి రాజకీయ బిక్ష పెట్టిందే కాంగ్రెస్ అని గుర్తించుకోవాలని హితవు పలికారు. సీఎం చిత్రపటాన్ని చించివేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ఊసరవెల్లి రాజకీయాలు మానుకోవాలని కాంగ్రెస్ మహిళా విభాగం మాజీ జిల్లా అధ్యక్షురాలు సుజాత పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో పదవులు అనుభవించిన సునీతారెడ్డి బీఆర్ఎస్‌లో చేరిన అనంతరం కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణ, ఆత్మ కమిటీ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వీరస్వామిగౌడ్, నాయకులు సత్యం, రియాజ్, పెంటయ్య, మణిదీప్, లక్ష్మీనారాయణ, సాయి, వెంకటేష్, అబ్దుల్ ఖదీర్, ఆంజనేయులు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

కళ్లులేని కళాకారుడికి

జగ్గారెడ్డి రూ.5 లక్షల ఆర్థిక సహాయం

- సీఎం రేవంత్ రెడ్డితో చెప్పి ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు కృషి
- తన కూతురు జయారెడ్డి వివాహ వేడుకల సందర్భంగా వచ్చిన అంధ గాయకుడికి ఆసరా



కళ్లు లేని కళాకారుడు రాజుకు రూ. 5 లక్షల ఆర్థిక సహాయం చేస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి, ఆంధ్రజ్యోతి : తన కూతురు జయారెడ్డి వివాహ సంబరాల్లో భాగంగా ఆదివారం రాత్రి సంగారెడ్డి రామ్‌నగర్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంగీత విభావరి కార్యక్రమాన్ని తలపెట్టారు. ఈ మ్యూజిక్ షోలో రాజు అనే అంధ గాయకుడు అద్భుతంగా పాటలు పాడి అలరించాడు. చలించిన జగ్గారెడ్డి వెంటనే రాజుకు రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందించారు. పేద కుటుంబానికి చెందిన రాజుకు సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కళ్లున్నవారు ఎలాగైనా బతుకుతారని కళ్లు లేని వారికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. ప్రముఖ గాయకుడు రామాచారి ఆధ్వర్యంలో సంగీత విభావరి అట్టహాసంగా జరిగింది. ఈ నెల 7న వివాహం సందర్భంగా జగ్గారెడ్డి కూతురు జయరెడ్డిని పెళ్లికూతురుగా ముస్తాబు చేశారు.



పెళ్లి కూతురుగా ముస్తాబైన జయారెడ్డితో కుటుంబ సభ్యులు



బోనస్.. బోగస్

ధాన్యం విక్రయించి రెండు నెలలైనా అందని సొమ్ము

జిల్లాలో 60వేల మెట్రిక్ టన్నుల సన్న వడ్ల సేకరణ

1,450 మంది రైతులకు రూ.31 కోట్ల బకాయి

మెదక్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌లో రైతులు విక్రయించిన సన్న రకం ధాన్యానికి సంబంధించిన బోనస్ ఇప్పటికీ రైతుల ఖాతాలో జమ చేయలేదు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. యాసంగి సీజన్ ముగిసి రెండు నెలలు గడిచిపోయింది. వానాకాలం వరినాట్లు దాదాపు పూర్తికావచ్చాయి. కానీ ఇప్పటికీ డబ్బులు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకూ బకాయిలు చెల్లించకపోవడంతో అన్నదాతలు నిరాశ చెందుతున్నారు. బోనస్ డబ్బులు సరైన సమయానికి చేతికి అందకపోవడంతో రైతులు వానాకాలం పంట పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సి వస్తున్నదని వాపోతున్నారు. వడ్డీలకు డబ్బులు తెచ్చుకుని పంటలకు పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వరినాట్లు చివరి దశకు చేరుకోవడంతో ఎరువుల కొనుగోళ్లు, పంట కలుపుతీత, వంటి వాటికి పెట్టుబడులు అవసరం. ఈ కీలక సమయంలో ప్రభుత్వం ప్రకటించిన బోనస్ డబ్బులు బకాయిలు ఇప్పటికే అందాల్సి ఉంది. బోనస్ చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యం నేపథ్యంలో రైతుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

93 కేంద్రాల్లో సన్నాల సేకరణ

యాసంగి సీజన్‌లో జిల్లాలో సన్నరకం ధాన్యం కొనుగోలు చేయడం కోసం ప్రత్యేకంగా 93 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వరి కోతలు ఆలస్యంగా ప్రారంభం కావడం, అకాల వర్షాలు వెంటాడడంతో జూన్ నెలాఖరు వరకు కొనుగోళ్లు కొనసాగాయి. యాసంగి సీజన్‌లో 60 వేల మెట్రిక్‌టన్నుల సన్న వడ్లను 1,450 మంది రైతుల నుంచి కొనుగోలు చేశారు. మద్దతు ధర మేరకు రూ.138 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. కానీ, ప్రభుత్వం ప్రకటించినట్లు క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ మొత్తం రూ.31 కోట్లు చెల్లించాల్సి ఉంది. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు బోనస్ కోసం ప్రభుత్వానికి సిఫారసు చేశారు. కానీ, ఇప్పటి వరకు ప్రభుత్వం బోనస్ మొత్తాన్ని విడుదల కాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వారం రోజుల్లో ఖాతాల్లో జమ చేస్తాం

యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 60 వేల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని 1450 మంది రైతుల వద్దనుండి కొనుగోలు చేశాం. ఇప్పటికే రూ. 138 కోట్లు సన్న ధాన్యం బాపతు డబ్బులు రైతుల బ్యాంకు అకౌంట్లలో జమ చేశాం. కొనుగోళ్ల వివరాలను ఆన్‌లైన్ లో నమోదు చేస్తూ బోనస్ చెల్లింపుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రతీ క్వింటా సన్న ధాన్యానికీ రూ.500 చొప్పున బోనస్ చెల్లించనుంది. ఈ వారం రోజుల వ్యవధిలో బోనస్ చెల్లింపులు జరిగే అవకాశం ఉంది.

-జగదీష్, జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎం

సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలో 25 రోజుల నుంచి యూరియా సరఫరా లేదు. మండలంలోని రెండు సొసైటీలకు 400 టన్నుల యూరియా మాత్రమే వచ్చింది. దీంతో రైతులు ఇతర ప్రాంతాలకు వెళ్లి అధిక ధరలు వెచ్చించి యూరియా బస్తాలు కొనుగోలు చేయాల్సిన అగత్యం ఏర్పడింది.

మెదక్ జిల్లా కొల్చారం మండలంలో యూరియా లేదని పుకార్లు లేవడంతో రైతులు ఆగమాగం అవుతున్నారు. దీంతో రూ.266.50 విలువైన ఒక యూరియా బస్తాకు రూ.300పైచిలుకు వెచ్చించి కొంటున్నారు. ఇంకొందరు వ్యాపారులు గుళికలు, ఫాస్పేట్, ఇతర మందులు తీసుకుంటేనే యూరియా బస్తా ఇస్తామని షరతులు విధిస్తున్నారు.

సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ఒక సొసైటీకి మాత్రమే యూరియా వస్తున్నది. ఎన్ని ఎకరాలున్నా ఒక రైతుకు ఒకట్రెండు బస్తాలు మాత్రమే ఇస్తున్నారు. దీంతో మండలంలోని రైతులు తీవ్రస్థాయిలో ఆగ్రహిస్తున్నారు. పంటలు ఎర్రబారుతుండడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి ఒక బస్తాకు రూ.350 నుంచి రూ.380 దాకా చెల్లించి తెచ్చుకుంటున్నారు



చిన్నకోడూరులోని ఆగ్రోస్ కేంద్రం తెరవకముందే యూరియా కోసం బారులు తీరిన రైతులు

యూరియా కావాలయ్యా!

ఉమ్మడి జిల్లాలో తీవ్ర కొరత.. అన్నదాతల కలత

- పంట ఎదిగే వేళ అరకొరగా పంపిణీ
- వానాకాలం తొలినాళ్లలోనే ఇబ్బందులు
- అధిక ధరలకు కొనుగోలు చేస్తున్న రైతులు
- ఈ నెలాఖరులో మరింత అవసరం
- చేతులెత్తేస్తున్న అధికారులు, వ్యాపారులు
- మళ్లీ వర్షాలు కురిస్తే అంతే సంగతి!

యూరియా కొరత రైతులను తీవ్రంగా కలవరపెడుతోంది. ప్రస్తుతం వరి, మొక్కజొన్న, పత్తి మొక్కలు ఎదిగే దశలో ఉన్నందున పంటలను దక్కించుకునేందుకు సరిపడా యూరియా కోసం నానా అగచాట్లు పడుతున్నారు. సహకార సంఘాలు, ఆగ్రోస్, ఫర్టిలైజర్ దుకాణాల్లో సరిపడా నిల్వలు లేకపోవడం సమస్యగా మారింది. గడిచిన పదేళ్లలో ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇలాంటి పరిస్థితి తలెత్తలేదు. మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సరిపడా నిల్వలను రైతులకు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సంగారెడ్డి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఈ ఏడాది వానాకాలం సీజన్ ఉమ్మడి జిల్లాకు కలిసిరాలేదు. మే నెలలో సాధారణం వర్షాలు కురియగా, ఆ తర్వాత ముఖం చాటేశాయి. జూన్‌లో అప్పుడప్పుడు పలకరించగా జూలై నెలాఖరులో మోస్తారుగా పడ్డాయి. దీంతో పంటల సాగు నెమ్మదించి విస్తీర్ణమూ తగ్గింది. వరి పంటకు గడువు ముగియడంతో చాలామంది రైతులు వెనక్కు తగ్గారు. జూన్ నెలలో నాట్లు వేయాల్సిన దశలో జూలై నెలాఖరులో నాట్లు వేశారు. ఇప్పటికీ కొందరు వర్షాల కోసం ఎదురు

మిగతా 7వ పేజీలో

యూరియా వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)		
జిల్లా	అవసరం	కేటాయింపు
సంగారెడ్డి	38,772	23,923
సిద్దిపేట	40,000	16,939
మెదక్	26,000	12,000



అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్నారని కొడిపల్లిలో ఫర్టిలైజర్ దుకాణానికి జారీ చేసిన నోటీసు



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

సంగారెడ్డి జిల్లాలో ముగిసిన

ధ్రువపత్రాల పరిశీలన

నేడు సీనియారిటీ తుది జాబితా ప్రకటన

బదిలీల తర్వాతే పదోన్నతులు ఇవ్వాలని హైకోర్టులో కేసు!

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలో భాగంగా సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయ ఆవరణలో పదోన్నతి పొందేందుకు అర్హులైన టీచర్ల ధ్రువపత్రాలను ఆదివారం కూడా పరిశీలించారు. స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్, సోషల్, బయోసైన్స్ సబ్జెక్టు టీచర్లతో పాటు ఎస్జీటీలు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. నేడు సీనియారిటీ జాబితాపై టీచర్ల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, వాటిని పరిష్కరించి సీనియారిటీ తుది జాబితాను విడుదల చేయనున్నారు. బదిలీల తర్వాత పదోన్నతులు చేపట్టాలని కోరుతూ కొందరు ఉపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించినట్టు ఉపాధ్యాయ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. దీనిపై మంగళవారం ప్రకటన వచ్చే అవకాశముందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. దీంతో, న్యాయస్థానం తీర్పుపై పదోన్నతులు జరుగుతాయా? షెడ్యూల్ వాయిదా పడుతుందా అన్న ఉత్కంఠ నెలకొన్నది.

మూత'బడులు' తెరిచేలా..

విద్యాశాఖ అధికారుల చర్యలు

సంగారెడ్డి జిల్లాలో 63 పాఠశాలలు మూత

ఎంఈవోలు చొరవ చూపాలని ఆదేశాలు

వట్‌పల్లి మండలం షాద్‌నగర్‌లో రీ ఓపెన్



వట్‌పల్లి మండలం షాద్‌నగర్‌లో తిరిగి తెరిచిన పాఠశాలలో విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో మూతపడిన పాఠశాలలను తిరిగి తెరవడానికి విద్యాశాఖ అధికారులు చొరవ తీసుకుంటున్నారు. గతంలో విద్యార్థులు లేక జిల్లావ్యాప్తంగా 63 ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. వీటికి మళ్లీ పూర్వవైభవం తీసుకురావాలనే ఉద్దేశంతో పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఎంఈవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి మూతపడిన బడుల రీఓపెన్‌కు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని డీఈవో ఆదేశించారు. దీంతో ఎంఈవోలు ఆ దిశగా కసరత్తు మొదలుపెట్టారు. విద్యార్థులు లేక మూతపడిన ప్రభుత్వ పాఠశాలలను తిరిగి ప్రారంభిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో చెప్పిన విషయం తెలిసిందే. దీంతో ఆ దిశగా పాఠశాల విద్యాశాఖ అధికారులు అడుగులు వేస్తున్నారు. అయితే జిల్లాలో జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లు 63 ఉన్నట్టు గుర్తించిన అధికారులు, ఈ విద్యా సంవత్సరం రీఓపెన్ చేసి ప్రవేశాలు కల్పించేలా అవకాశం కల్పించారు. ఇందులో భాగంగా జిల్లాలోని వట్‌పల్లి మండలం షాద్‌నగర్ (గట్టుపల్లి)లో మూతబడిన సర్కారు బడిని రీఓపెన్ చేసి ఈ విద్యా సంవత్సరం ప్రవేశాలు కల్పించారు. ఇక తాజాగా రెండు రోజుల కిందట కొండాపూర్ మండలంలోనూ మూతపడిన పలు సర్కారు బడులను డీఈవో వెంకటేశ్వర్లు స్వయంగా పరిశీలించారు. ఆ పాఠశాలలు మూతబడడానికి గల కారణాలను ఎంఈవో దశరథ్ ద్వారా తెలుసుకున్నారు. ఏ అవకాశం ఉన్నా బడులు తిరిగి తెరిపించి ప్రవేశాలు కల్పించేలా చొరవ చూపాలని డీఈవో ఆయనను ఆదేశించారు. ఏదేమైనప్పటికీ విద్యాశాఖ తీసుకుంటున్న చొరవతో మూత బడిన సర్కారుకు పూర్వవైభవం రావాలని ఆశిద్దాం.

నివేదిక తెప్పిస్తున్నాం

జిల్లావ్యాప్తంగా మూతపడిన పాఠశాలలు తెరిగి తెరిపించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. బడి ఎందుకు మూసేయాల్సి వచ్చిందనే కారణాలతో కూడిన నివేదిక ఇవ్వాలని ఎంఈవోలను ఆదేశించాం. ఆయా పాఠశాలల పరిధిలో ఉన్న విద్యార్థులను చేర్పించి తిరిగి తెరిచేలా చూడాలని ఆదేశించాం.

-ఎస్.వెంకటేశ్వర్లు, డీఈవో, సంగారెడ్డి జిల్లా

ఇష్టారాజ్యంగా సర్దేశారు

ఉపాధ్యాయుల సర్దుబాటు తొలి జాబితాలో లోపాలపై ఉన్నతాధికారులు సీరియస్

విచారణ అనంతరం తుది జాబితాలో భారీ మార్పులు

తప్పుడు సమాచారం ఇచ్చిన ఎంఈవోలపై చర్యలు?



సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటులో లోపాలు బయటపడ్డాయి. క్షేత్రస్థాయిలో ఎంఈవో ఇచ్చిన తప్పుడు సమాచారంతో ఉపాధ్యాయుల సర్దుబాటు రసాభాసగా మరిందని ఆరోపిస్తూ ఉపాధ్యాయ సంఘాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాయి. దీంతో, జిల్లా విద్యాశాఖ విడుదల చేసిన తొలి జాబితాను పక్కనపెట్టారు. నిబంధనలు పాటిస్తూ మళ్లీ జాబితాను తిరిగి రూపొందించారు. కానీ, ఇందుకు కారణమైన వారిపై చర్యలు తప్పవని తెలుస్తున్నది.

తప్పుడు సమాచారం

విద్యార్థులు తక్కువ ఉన్న బడుల నుంచి సర్‌ప్లస్ ఉన్న ఉపాధ్యాయులను అవసరమైన చోటికి సర్దుబాటు చేయాలనే ఆదేశాలతో జిల్లా విద్యాశాఖ గత నెల 22న 349 మందితో జాబితాను రూపొందించిన విషయం తెలిసిందే. దీనిపై ఆరోపణలు రావడంతో విచారణ జరిపించి మరోసారి జాబితాను సిద్ధం చేశారు. తొలి జాబితా నుంచి 25 మంది టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులు రద్దు చేశారు. మరో 18 మందిని కొత్తగా గుర్తించిన పాఠశాలలకు సర్దుబాటు చేశారు. 40 మంది టీచర్ల సర్దుబాటు ఉత్తర్వుల్లో మార్పులు చేశారు. ఇలా తొలి జాబితాలోని 83 మంది టీచర్ల స్థానాల్లో మార్పులు చేర్పులు చేయాల్సి వచ్చింది. ఎంఈవోలు తప్పుడు సమాచారం ఇవ్వడంతోనే తొలి జాబితాలో గందరగోళం నెలకొన్నదని ఉన్నతాధికారులు ఆగ్రహంగా ఉన్నారు. ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించిన ఎంఈవోలపై కలెక్టర్ సీరియస్‌గా ఉన్నారని తెలిసింది. తప్పుడు సమాచారం ఇచ్చిన ఎంఈవోలపై కలెక్టర్ చర్యలు తీసుకునే అవకాశం ఉందని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.




మనస్తాపంతో కార్మికుడి ఆత్మహత్య

చేగుంట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఓ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చేగుంట శివారులోని డంపింగ్ యార్డు వద్ద చోటుచేసుకుంది. చేగుంట ఎస్సై బిక్యానాయక్ తెలిపిన వివరాల ప్రకారం... ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఆశిష్ కుమార్ (24) చిన్నశివనూర్ శివారులోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో ఐదేళ్లుగా కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆశిష్ ఈ నెల 1న మందులు తెచ్చుకుంటానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆరోగ్యంనయం కాకపోవడంతో మనస్తాపం చెంది శనివారం రాత్రి వడియారం రైల్వే స్టేషన్ సమీపంలోని డంపింగ్‌యార్డు వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి బిందేశ్వర్ ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఆశిష్‌కుమార్ మృతదేహం













రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురికి తీవ్ర గాయాలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో జరిగిన నాలుగు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. కోహెడ, చిన్న శంకరంపేట, నారాయణఖేడ్, చేర్యాల మండలాల పరిధిలో ఈ ఘటనలు ఆదివారం చోటుచేసుకున్నాయి.

- కోహెడ/చిన్నశంకరంపేట/నారాయణఖేడ్, చేర్యాల ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) :

● కోహెడ మండలం వెంకటేశ్వరపల్లి గ్రామంలోని పెద్దమ్మ ఆలయం వద్ద ఆదివారం ఆటో అదుపు తప్పి పొలంలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. కోహెడ గురుకుల హాస్టల్‌కు చికెన్, కూరగాయలు, పండ్లు, ఇతర వంట సామగ్రిని తీసుకెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్పందించిన స్థానిక రైతులు చికిత్స కోసం అతడిని కోహెడ ఆసుపత్రికి తరలించారు.

●నారాయణఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్ శివారులో 161బీ జాతీయ రహదారిపై ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్నాయి. మనూరుకు చెందిన మేత్రినగేష్, గోర్నాల నర్సింహులు ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసినా ఆలస్యం చేయడంతో అటుగా వెళ్తున్న పోతుల మహిపాల్‌రెడ్డి స్థానికుల సహాయంతో తన కారులో వారిని ఖేడ్ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు.



క్షతగాత్రులను ఖేడ్ ఏరియా వైద్యశాలకు తీసుకొచ్చిన స్థానికులు

● చిన్నశంకరంపేట మండలం మెదక్-చేగుంట రహదారి గవ్వలపల్లి ఎక్స్‌రోడ్డు దగ్గర రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో జంగరాయి గ్రామానికి చెందిన పున్న కల్యాణ్, ప్రవీణ్ గాయపడ్డారు. అలాగే గవ్వలపల్లికి మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో మెదక్ ఆసుపత్రికి తరలించారు.

● జనగామ-సిద్దిపేట జాతీయ ప్రధానరహదారిపై చేర్యాలలోని పాతబస్టాండ్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన మహ్మద్ స్వరాజ్ దంపతులు బైక్ వెళ్తున్నారు. పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రాకేష్ బైక్‌పై వస్తుండగా రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రాకేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పాముకాటుతో బాలిక మృతి

జోగిపేటరూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): జోగిపేట పట్టణంలో పాముకాటుతో బాలిక ఆదివారం మృతి చెందింది. పట్టణంలోని రెండోవార్డుకు చెందిన పిట్ల నవ్య(8) ఇంట్లో సోఫాలో కూర్చుని ఉండగా పాము కాటేసింది. విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పడంతో వారు వెంటనే బాలికను జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పరిస్థితి విషమించి నవ్య మృతి చెందింది. కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.



నవ్య (ఫైల్)

దుకాణాల్లో చోరీ.. నిందితుడి అరెస్టు

దుబ్బాక, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): దుబ్బాకలో రెండు దుకాణాల తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడిన దొంగను పోలీసులు24 గంటల్లోనే పట్టుకున్నారు. దుబ్బాక ఎస్సై కీర్తిరాజు నేతృత్వంలోని బృందాలు గాలింపు చేపట్టి చోరీకి పాల్పడిన చెక్కపల్లి శివకుమార్‌ను అరెస్టు చేశారు. శనివారం తెల్లవారుజామున గౌస్ మొబైల్, ఉదయకల్యాణ్ పెయింటింగ్ దుకాణాల్లో చోరీకి పాల్పడిన నిందితుడి నుంచి రూ. 80వేల విలువైన 10 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.





అక్రమ మట్టి రవాణాకు అడ్డుకట్ట

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొల్చారం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కొల్చారంలో అర్ధ రాత్రి జరుగుతున్న అక్రమ మట్టి రవాణా ఆగిపోయింది. శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'మట్టి.. కొల్లగొట్టి' కథనంతో అనుమతులు లేకుండా వందలాది టిప్పర్ల ద్వారా తరలిస్తున్న మట్టిపై అధికారులు దృష్టి సారించారు. రిసార్ట్ నిర్మాణానికి లీజు పేరుతో మట్టిని తరలిస్తున్నట్లు తెలిసింది. అయితే, అధికారులు ఇచ్చిన పత్రాల్లో సమయం, మట్టి పరిమాణం, టిప్పర్ నంబర్లు లేకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

పొన్నాల బాలయ్యకు సినారె పురస్కారం



సినారె సాహిత్య పురస్కారం అందుకుంటున్న పొన్నాల బాలయ్య

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటకు చెందిన కవి, రచయిత పొన్నాల బాలయ్యకు ప్రతిష్ఠాత్మక మహాకవి సినారె సాహిత్య పురస్కారం లభించింది. ఆదివారం హైదరాబాద్‌లో సినారె కళాపీఠం, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. పద్మభూషణ్, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా. సి.నారాయణరెడ్డి 94వ జయంతి సందర్భంగా ఈ పురస్కారాన్ని అందజేశారు. సంస్థ అధ్యక్షుడు మల్లెకేడి రాములు, సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు డా.నందిని సిధారెడ్డి, కవి, రచయితలు బైస దేవదాసు, కాకుమాను సునీల్, దాసరి దయానందరెడ్డి, డా. పోరెడ్డి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

'సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి'



రిటైర్డ్ సైనిక అధికారులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

సిద్దిపేట రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): యుద్ధంలో సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని సీనియర్ జర్నలిస్ట్ కొమురవెల్లి అంజయ్య అన్నారు. ఆదివారం నారాయణరావుపేటలో రిటైర్డ్ సైనికాధికారులతో నిర్వహించిన 'సైనిక నీకు సలాం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రిటైర్డ్ సైనికాధికారులు మానేటి కిషన్‌డ్డి, ఐలేని స్కైలాబ్, అంబటి చంద్రమౌళి, జోజీ దసరిపల్లి, మారబోయిన రాగయ్య, గిరి శ్రీనివాస్రెడ్డిలు తమ అనుభవాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహచారి, శ్రీనివాస్‌రెడ్డి, రాజారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో రెండు పతకాలు



పతకాలను చూపిస్తున్న గణేష్, సిరి చందన

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో సిద్దిపేట జిల్లాకు రెండు పతకాలు లభించాయి. అండర్ 20 రేస్ వాక్‌లో గణేష్ బంగారు పతకం సాధించగా, అండర్ 16 బాలికల జావలిన్ త్రోలో సిరి చందన వెండి పతకం గెలుచుకుందని సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కర్రోళ్ల వెంకటస్వామి గౌడ్ తెలిపారు. మెడల్స్ సాధించిన క్రీడాకారులను జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, స్పోర్ట్స్ క్లబ్ కన్వీనర్ పాల సాయిరాం, డీవైఎస్‌వో వెంకట నరసయ్య, సిద్దిపేట జిల్లా సైకిల్ అసోసియేషన్ అధ్యక్షుడు బండారుపల్లి శ్రీనివాసులు, ఎస్జీఎఫ్ మాజీ సెక్రటరీ పన్యాల రామేశ్వర్ రెడ్డి, టీజీ పెటా జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడకంచి ఉప్పలయ్య, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామిరెడ్డి రవీందర్ రెడ్డి, శిక్షకులు ప్రభాకర్, నిశాంక్ గౌడ్, లక్ష్మణ్ అభినందించారు.

'మెక్కిన అవినీతి సొమ్మును కక్కించాలి'

● జీఎంపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్



మాట్లాడుతున్న ఉడుత రవీందర్

సిద్దిపేట క్రైం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గొల్ల కురుమల సంక్షేమం కోసం గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకంలో మెక్కిన అవినీతి సొమ్మును కక్కించాలని గొర్రెలు మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ డిమాండ్ చేశారు. ఆదివారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో జీఎంపీఎస్ మూడవ జిల్లా మహాసభలో ఆయన మాట్లాడుతూ ఈ అవినీతిలో పశుసంవర్ధక శాఖ అధికారులు, దళారులు లాభపడ్డారని ఆరోపించారు. ఏసీబీ విచారణలో రూ.700 కోట్లు, ఈడీ విచారణలో రూ.1,000 కోట్లు అవినీతి జరిగినట్లు వెల్లడైందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని ఆపేందుకు కుట్ర చేస్తోందని, అలా జరిగితే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. నాయకులు ఎల్లయ్య, శేఖర్, దాసరి కనకయ్య, బర్మ కొమురయ్య, ఈరు లింగయ్య, కొమురెల్లయ్య, బెడిదే బాల మల్లు, బెడిదే కొమరయ్య, వాసూరి స్వామి, ఆలేటి అంజనేయులు, వేల్పుల రాజు, ఇరుమల కుమార్, అల్ల శ్రీకాంత్, ప్రశాంత్, సత్తయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మ కొట్టింది.. పీఎస్‌లో బాలుడి ఫిర్యాదు



తండ్రితో కలిసి పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రాజు

వట్‌పల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తల్లి కొట్టిందని సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలానికి చెందిన 17 ఏళ్ల బాలుడు రాజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శనివారం ఎరువుల బస్తాలను ఇంట్లో పెట్టమని తల్లి అనురాధ చెప్పగా, రాజు వినలేదు. దీంతో కోపంతో అనురాధ రాయితో కొట్టడంతో రాజు తలకు గాయమైంది. ఆదివారం తండ్రి దాసుతో కలిసి పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన రాజును చికిత్స చేయించుకుని రావాలని పోలీసులు సూచించారు. అనంతరం రాజు తిరిగి వచ్చి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ.1.94లక్షలకు టోకరా

రామాయంపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : అధిక డబ్బు ఆశకు పోయి సొమ్ము గుల్ల చేసుకున్నాడు రామాయంపేటకు చెందిన వేముల సుజిత్. నగదు జమచేస్తే ఉద్యోగంతో పాటు రెట్టింపు ఇస్తామని అతనికి ఆదివారం రాత్రి మెసేజ్ వచ్చింది. దీంతో విడతలవారీగా రూ.1,94,000 ఆన్‌లైన్‌లో సైబర్ నేరగాళ్లకు పంపాడు. తీరా మోసాన్ని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఉపాధి కోసం పల్లెబాట

వ్యవసాయ పనుల కోసం వెళ్తున్న కూలీలు

- రోజూ 50 ఆటోల్లో గ్రామాలకు
- ఈజీఎస్ లేకపోవడంతో పనులు వెతుక్కుంటూ..
- స్థానికంగా అవకాశాలు కరువు
- రోజు కూలి రూ.400
- ఆటోవాలాలే మధ్యవర్తులు



వ్యవసాయ పనులకోసం పల్లెలకు వెళ్లేందుకు ఆటోలో ఎక్కుతున్న మహిళా కూలీలు

హుస్నాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో పనులు లేకపోతే పట్టణానికి పోతారు. కాని ఇక్కడ పట్టణ కూలీలు పల్లెబాట పడుతున్నారు. ప్రస్తుతం పల్లెల్లో జరిగే వ్యవసాయ పనుల్లో హుస్నాబాద్ పట్టణ కూలీలే దర్శనమిస్తున్నారు. ప్రతి రోజు ఉదయాన్నే దాదాపు 50కి పైగా ఆటోల్లో 500 మంది వరకు పనుల కోసం కిలోమీటర్ల దూరం వెళ్లి వస్తున్నారు. కోహెడ, అక్కన్నపేట, బెజ్జంకి, హుస్నాబాద్ మండలాల్లో జరిగే వ్యవసాయ క్షేత్రాల్లో హుస్నాబాద్ పట్టణ కూలీలే అధికంగా కనిపిస్తున్నారు. ఇక్కడ ఉపాధి హామీ పనులు రద్దు చేయడం, హుస్నాబాద్ ప్రాంతంలో ఫ్యాక్టరీలు, ఇతర ఉపాధి కల్పనలు లేకపోవడంతో పల్లెలకు వెళ్లాల్సి వస్తున్నదని పలువురు పేర్కొంటున్నారు.

2013 నుంచి ఉపాధి పనులు బంద్

సెప్టెంబర్ 2011 సంవత్సరంలో మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న హుస్నాబాద్‌తోపాటు పలు జీపీలను నగరపంచాయతీగా అప్‌గ్రేడ్ చేశారు. 2013 సంవత్సరం వరకు ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించారు. ఆ తరువాత మున్సిపల్ నిబంధనల ప్రకారం నగరపంచాయతీల్లో ఈ పథకాన్ని రద్దు చేశారు. అనంతరం హుస్నాబాద్ నగరపంచాయతీ నుంచి మున్సిపల్‌గా అప్‌గ్రేడ్ చేశారు. దీంతో ఉపాధి హామీ పథకాన్ని మొత్తానికి తీసివేశారు. దీంతో హుస్నాబాద్‌లో దాదాపు 850 కుటుంబాల్లోని 1893 మందికి ఉపాధి లేకుండా పోయింది. కుటుంబంలో నలుగురు ఉపాధి పనులకు పోతే రూ.900లకు పైగా కూలీ వస్తే కుటుంబ పోషణకు సరిపోయేది. కానీ ఇప్పుడు స్థానికంగా పని దొరకక వ్యవసాయ పనుల కోసం దూర ప్రాంతాలకు ఆటోల్లో వెళ్లాల్సి వస్తున్నది. మహిళలకు రూ. 400 నుంచి రూ.500 వరకు చెల్లిస్తున్నారు.

ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినా..

మున్సిపాలిటీలో ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయింది. ఈ విషయమై బోయినిపల్లి వినోద్‌కుమార్ ఎంపీగా ఉన్నప్పుడు పార్లమెంట్‌లో ప్రస్తావించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి పలు మార్లు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువైంది. ఇప్పటికైనా దిగువ శ్రేణి మున్సిపాలిటీల్లో అమలు చేసేందుకు కేంద్ర హోంశాఖ సహాయ కార్యదర్శి బండి సంజయ్, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు చొరవ తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

పనులు లేకనే..



హుస్నాబాద్ మున్సిపాలిటీ అయిన నుంచి ఉపాధి పని బంద్ అయి గ్రామాలకు వ్యవసాయ పనులకు పోతున్నాం. పొద్దున ఆటోలో పోయి సాయంత్రం 5 గంటలకు ఇంటికి వస్తే రూ.350, రూ. 400 వరకు కూలి వత్తది. ఇక్కడ చిన్న పాటి ఫ్యాక్టరీలు కూడా లేకపోయే. మున్సిపాలిటీ అయితే మా బతుకులు ఏమన్నా మారినయా. ఉపాధి కూలీ పెడితే అందరికీ పని దొరుకుద్ది.

-రోళ్ల భాగ్య, హుస్నాబాద్

30 మంది టీమ్‌గా పోతం..



ఇప్పుడు గ్రామాల్లోనే వ్యవసాయ పనులు దొరుకుతున్నయి. మేం 30 మందిమి కోహెడ, బస్వాపూర్, బెజ్జంకి వరకు ఆటోలల్లో పనులకు పోతన్నం. ఇక్కడ పనులుంటే అక్కడికి పోయే వాళ్లం కాదు. ఇప్పటికైనా గవర్నమెంట్ ఉపాధి హామీ పథకం పెట్టాలే..

-కానవేని మాధవి, హుస్నాబాద్

దూరాన్ని బట్టి కిరాయి..



హుస్నాబాద్ నుంచి ఊర్ల లోని వ్యవసాయదారుల పనులకు కూలీలను తీసుకపోతే నాకు ఇంత కూలి గిట్టుబాటయితది. 20 కిలోమీటర్ల దాటితే రూ.2వేలు, దగ్గర అయితే రూ. 12వందలు ఇస్తరు. రోజు పనులకు తీసుకపోయి, మళ్లీ తీసుకొస్తా.

- భూక్య రాజు, ఆటో డ్రైవర్



సర్టిఫికెట్లు అందుకున్న విజేతలతో నిర్వాహకులు

మహిళలు ఆరోగ్యం కాపాడుకోవాలి

● సిద్దిపేట జిల్లా పంచాయతీ అధికారి దేవకిదేవి

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించడంతో పాటు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి దేవకిదేవి సూచించారు. సిద్దిపేటలో జరిగిన అస్మిత సిటీ లీగ్ యోగాసన పోటీల ముగింపు సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ పోటీల్లో 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారని కాంపిటీషన్ డైరెక్టర్ తోట సంధ్య తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, ప్రధాన కార్యదర్శులు నిమ్మ శ్రీనివాసరెడ్డి, కొమురవెల్లి అంజయ్య, చీఫ్ పాట్రన్ చిప్ప ప్రభాకర్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి విక్రమ్ రెడ్డి, సంస్కారభారతి అధ్యక్షురాలు లక్కిరెడ్డి విజయ, చింత శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

విజేతల వివరాలు..

అండర్ 18 ట్రెడిషనల్ యోగాసన: భూమిక (వనపర్తి), వైష్ణవి (జెడ్పీహెచ్ఎస్ నారాయణరావుపేట), హర్షిణి (జెడ్పీహెచ్ఎస్ మర్పడగ), సాహితీ (టీజీఎస్ఆర్ మిట్టపల్లి), అర్చన (మర్పడగ).

ఎబోవ్ 18 ట్రెడిషనల్ యోగాసన: వి. శ్రీలత (సిద్దిపేట), సంగీత (నర్సింగ్ కాలేజీ సిద్దిపేట), కె. కిరణ్మయి (ఇందూరు కాలేజీ), హిమబిందు (ఇందూరు కాలేజీ), ఎం. అక్షయ (నర్సింగ్ కాలేజీ).

అండర్ 18 సుపైన్ ఇండివిడ్యువల్ యోగాసన: డి. మౌనిక (వనపర్తి), పి. రుష్మిత (నారాయణరావుపేట), వై. హేమశ్రీ (నలంద హైస్కూల్ గజ్వేల్), ఎ. లిఖిత (నారాయణరావుపేట), బి. మనస్విని (ఎస్ఆర్ హైస్కూల్, సిద్దిపేట).

ఎబోవ్ 18 సుపైన్ ఇండివిడ్యువల్ యోగాసన: మౌనిక (నర్సింగ్ కాలేజీ), పి. అను (నర్సింగ్ కాలేజీ), జి. సంధ్య (నర్సింగ్ కాలేజీ), సిహెచ్. హర్షిత (నర్సింగ్ కాలేజీ), జి. ప్రణవి (నర్సింగ్ కాలేజీ).

రెండోసారి సైకిల్‌పై..

● సతీమణితో కలిసి 22 కి.మీ. ప్రయాణించిన మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

● ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ



రామాయంపేటకు సైకిల్‌పై వస్తున్న కలెక్టర్ దంపతులు

రామాయంపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ మరోసారి ప్రత్యేక శైలిని చాటుకున్నారు. ఆదివారం ఉదయం తన భార్య శ్రీజతో కలిసి మెదక్ నుంచి రామాయంపేట వరకు 22 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణించి అక్కడి ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గంటపాటు ఆసుపత్రిలో గడిపి సౌకర్యాలను పరిశీలించారు. ఆసుపత్రిలో ప్రసవాలు జరగడం లేదని గుర్తించి, వెంటనే గైనకాలజిస్ట్ పోస్టు భర్తీ చేస్తామని ప్రకటించారు. అంతేకాకుండా, వైద్య సిబ్బంది హాజరు, మందుల నిల్వలను తనిఖీ చేసి, రోగికి



రామాయంపేట ఆసుపత్రిలో మందుల నిల్వలు చూస్తున్న కలెక్టర్

చేసే పరీక్షల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని డాక్టర్ నిహారికకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కలెక్టర్, ఈ సీజన్‌లో మలేరియా కేసులు నమోదు కాలేదని, డెంగ్యూ కేసులు ప్రమాద స్థాయిలో లేవని స్పష్టం చేశారు. మెదక్-రామాయంపేట హైవే పనుల భద్రతపై సంబంధిత అధికారులతో చర్చిస్తానని తెలిపారు.

గతంలో కూడా..

గతంలో కూడా రాహుల్ రాజ్ పొలం బాట, కాలినడక, సైకిల్ ప్రయాణం వంటి ప్రత్యేక పద్ధతులతో ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. గత మార్చి నెలలో కూడా ఆయన 22 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణించి బస్టాండ్ సమస్యలను తెలుసుకున్నారు. అలాగే, దంతేపల్లి ఫారెస్ట్‌లో కాలినడకన వెళ్లి ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ విధంగా ప్రజలకు మరింత దగ్గరయ్యేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలు ప్రశంసనీయం.

కథల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న అభిజ్ఞ, అఖిల

కొండపాక/ చిన్నకోడూరు/ సిద్దిపేట అర్బన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మాచిరాజు బాల సాహిత్య పీఠం నిర్వహించిన కథల పోటీల్లో సిద్దిపేట జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బక్రీ చెప్యాల ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థిని జక్కుల లోహిత, కొండపాక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని పి.అభిజ్ఞ, చిన్నకోడూరు మండలం అనంతసాగర్ జడ్పీ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని బి.అఖిలకు పురస్కారాలు లభించాయి. వీరికి ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, నేషనల్ బుక్ ట్రస్ట్ సభ్యుడు పత్తిపాక మోహన్ నగదు పురస్కారం, ప్రశంసాపత్రం అందజేశారు.

బాలకథా చంద్రిక పుస్తకావిష్కరణ

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం రచించిన 'బాలకథా చంద్రిక' పుస్తకాన్ని హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఆవిష్కరించారు. చందమామ కథా రచయిత మాచిరాజు కామేశ్వరరావు ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ, రచయితలు పైడిమర్రి రామకృష్ణ, చంద్రప్రతాప్, ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి, బూర్ల నాగేశ్వరరావు, పుప్పాల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు

● ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నారాయణఖేడ్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు తప్పవని సీపీఐ రాష్ట్ర నాయకులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం నారాయణఖేడ్‌లో జరిగిన సీపీఐ జిల్లా నాలుగో మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి రాష్ట్రపతికి పంపినప్పటికీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వార్థ రాజకీయాల కోసం దాన్ని అడ్డుకుంటోందని ఆరోపించారు. రాష్ట్రపతి ఈ బిల్లును ఆమోదించాల్సిన అవసరం ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో తప్పు చేసినవారు ఎంతటివారైనా ఉపేక్షించవద్దని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశానికి జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ అధ్యక్షత వహించగా, జిల్లా ఇన్‌చార్జి నర్సింహా, రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు మందపవన్, రాష్ట్ర నాయకులు ప్రకాష్‌రావు, జిల్లా సహాయ కార్యదర్శి ఆనంద్, కార్యవర్గ సభ్యులు రెహమాన్, తాజొద్దీన్, దత్తురెడ్డి, మహబూబ్‌ఖాన్, రుబీనా, కౌన్సిల్ సభ్యులు చిరంజీవి, అశోక్, ఈసాక్, లింగం, సతీష్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

యూరియా కావాలయ్యా!

(5వ పేజీ తరువాయి)

చూస్తున్నారు. అయితే పంటలు సాగు చేసిన రైతులకు యూరియా గండం ఏర్పడుతోంది.

అధిక ధర.. అడ్డగోలు లింకులు

- సంగారెడ్డి పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్నారని ఒక షాపు పై కేసు నమోదు చేశారు
- చేర్యాలలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో ప్రస్తుతానికి యూరియా స్టాకు లేదు. వ్యాగన్ రానందున ఉన్న స్టాకును ఆగ్రోస్, పీఏసీఎస్ సొసైటీలకు తరలించారు.
- కొల్చారం మండలం దుంపలకుంటలో యూరియా కావాలంటే గుళికలు లేదా ఫాస్పేట్ లింకు పెడుతున్నారు. ఇదే మండలంలోని పలు షాపుల్లో రూ.300కుపైగా ఒక యూరియా బస్తా విక్రయిస్తున్నారు.
- మునిపల్లి మండలంలోని ఫర్టిలైజర్ షాపుల్లో యూరియా లభించడం లేదు. రెండో దఫా చల్లడానికి యూరియా అందుబాటులో లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు.
- మనోహరబాద్ మండలంలో యూరియా కొరత దృష్ట్యా ఒక ఎకరం ఉన్న వారికి రెండు బస్తాల యూరియా మాత్రమే ఇస్తున్నారు.
- చిన్నకోడూరులో రూ.270 నుంచి రూ.280 వరకు ఒక బస్తా యూరియా విక్రయిస్తున్నారు.
- తొగుట మండలంలోని సొసైటీల్లో బస్తాకు రూ.280 వసూలు చేస్తుండగా ప్రైవేట్ షాపుల్లో రూ.290 దాకా తీసుకుంటున్నారు.
- ములుగు మండలంలోని ఫర్టిలైజర్ షాపుల్లో యూరియా కొరత ఉంది. పాస్‌బుక్ ఉన్న రైతుకు 2 బస్తాలకు మించి ఇవ్వడం లేదు.
- కౌడిపల్లి మండలంలో అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్నారని రైతులు ఫిర్యాదు చేయడంతో భాగ్యలక్ష్మి ట్రేడర్స్ దుకాణానికి స్టాప్ సేల్స్ విధిస్తూ వ్యవసాయాధికారి నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసును నాలుగు రోజులపాటు గోప్యంగా ఉంచారు. మిగతా షాపుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.
- కుకునూరుపల్లి మండలంలో ఎకరాకు ఒక బస్తా యూరియా మాత్రమే విక్రయిస్తున్నారు.
- సిద్దిపేట అర్బన్, రూరల్ మండలాల్లో యూరియా కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారు. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నా అధికారులు చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.



తొగుట సొసైటీ కార్యాలయానికి యూరియా కోసం వచ్చిన రైతులు

వానొస్తే ఆగమే..

సమృద్ధిగా వర్షాలు కురిస్తే యూరియా కోసం రైతులు రోడ్డెక్కే పరిస్థితి వస్తుందనే అంచనాలు నెలకొన్నాయి. ఎందుకంటే వానాకాలం సీజన్‌లో సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల నుంచి యూరియా కోసం అంచనా నివేదిక పంపించారు. ఆయా జిల్లాల్లో సాగవుతున్న పంటల దృష్ట్యా ఎంత యూరియా కావాలనే విషయాన్ని పైకి తెలిపారు. కానీ ఇప్పటివరకు జిల్లాకు కేటాయించిన యూరియా నిల్వలతో వానాకాలం సీజన్ గట్టెక్కే పరిస్థితి కనిపించడం లేదు. ఎందుకంటే అంచనాలో సగం వరకే యూరియా నిల్వలు కేటాయించారు. మూడు జిల్లాల్లో 1,04,772 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా 52,862 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చింది. చాలా దుకాణాల్లో స్టాకు లేదనే చెబుతున్నారు. మొన్నటి దాకా తొలి దఫా యూరియాను వినియోగించారు. ఈనెలలో వరికి పెద్దఎత్తున యూరియా అవసరం పడుతుంది. మొక్కజొన్న, పత్తికి వినియోగించాల్సిన పరిస్థితి. వర్షం పడిందంటే రైతులంతా యూరియా వైపు పరుగులు పెడతారు. అందుకే అధికార యంత్రాంగం అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది.

● ప్రకృతి ఒడిలో జల సవ్వడి



కొండగుట్టల పైనుంచి పారుతున్న జలపాతం



జలపాతం వద్ద సందడి చేస్తున్న యువకులు

రామాయంపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు మెదక్ జిల్లా రామాయంపేట మండలం తొనిగండ్ల అటవీ ప్రాంతంలో జలసవ్వడి కనువిందు చేస్తోంది. ఎత్తైన బండల మీదుగా పారుతున్న జలపాతం ఆకట్టుకుంటోంది. పక్షంరోజులుగా ఉధృతంగా ప్రవహిస్తున్న పుష్పాల వాగు ఎత్తు ప్రాంతం నుంచి వరదగా పడుతుండటంతో యువత స్నానాలకు దిగి ఎంజాయ్ చేస్తున్నారు. రామాయంపేట పట్టణానికి ఇది 8 కిలోమీటర్ల దూరం ఉండడంతో ప్రకృతి అందాలను, జలపాతాన్ని చూసేందుకు పలువురు తరలుతున్నారు.

● ఆదమరిస్తే అంతే..



పటాన్‌చెరు జాతీయ రహదారిపై ప్రమాదకరంగా గుంత

పటాన్‌చెరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు నుంచి ముత్తంగి అవుటర్‌కు దగ్గరలో పోచారం రోడ్డు వద్ద జాతీయ రహదారికి ఆనుకొని జలమండలి అధికారులు పైపులైన్ మరమ్మతుల పేరుతో గుంతను తవ్వారు. భారీ వర్షం కురిసినప్పుడు గుంతలోని నీరంతా రోడ్డుపై పారుతోంది. అలాగే రోడ్డుపక్కనే ఉండడంతో వాహనదారులు అందులో పడిపోయి ప్రమాదం జరిగే అవకాశం ఉన్నదని, సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

● అల్లుకున్న నిర్లక్ష్యం



సీతానగర్‌లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను చుట్టేసిన పిచ్చిమొక్కలు

అల్లాదుర్గం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గం మండలం సీతానగర్ గ్రామంలోని గృహాల మధ్య ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పిచ్చిమొక్కలు కప్పేశాయి. అలాగే ట్రాన్స్‌ఫార్మర్‌కు సరఫరా చేసే విద్యుత్ తీగలను సైతం చుట్టేశాయి. అసలే వర్షాకాలం.. వర్షం పడినప్పుడు పిచ్చిమొక్కలకు విద్యుత్ సరఫరా అయ్యే అవకాశాలు ఉన్నాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి అల్లుకున్న తీగలను తొలగించే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

కొండాపూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బీఆర్ఎస్‌కు చెందిన నాయకుల కుటుంబసభ్యులను సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబసభ్యులకు సానుభూతి, మనోధైర్యాన్ని ఇచ్చారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు విఠల్, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, ఇంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

నీలకంటి సంఘం కార్యవర్గం ఎన్నిక

పెద్దశంకరంపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేట నీలకంటి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం నీలకంటి సంఘం భవనంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నీలకంటి విఠల్, ఉపాధ్యక్షుడిగా కరణం రాంచందర్, కార్యదర్శిగా దయానంద్, కోశాధికారిగా బాస్కర్, కార్యవర్గసభ్యులుగా శ్రీశైలం, రాజు, జగన్, పోశెట్టి, నాగరాజు, ఆగమయ్య, అనిల్‌కుమార్, ముఖ్య సలహాదారులుగా నీలకంటి ప్రశాంత్‌కుమార్‌ను సభ్యులందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు : సీఐ

కంగ్టి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని కంగ్టి సీఐ వెంకటరెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఆయన కంగ్టిలో విలేకరులతో మాట్లాడుతూ సరైన పత్రాలు లేకున్నా, చిన్నపిల్లలకు వాహనాలు ఇచ్చినా కేసులు నమోదు చేస్తామన్నారు. వాహన చోదకులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం

చిన్నశంకరంపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : పేదలకు అండగా ఉంటామని సానిక్ష ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ శివ అన్నారు. చిన్నశంకరంపేట మండలంలోని గజగట్లపల్లి గ్రామానికి చెందిన ముత్రాతి లక్ష్మి పక్షవాతంతో బాధపడుతూ లేవలేని స్థితిలో ఉన్నది. వీకెన్ మేక్ ఏ ఛేంజ్ టీం అధ్యక్షుడు భార్గవ్ సహకారంతో వీల్‌చైర్‌ను అందజేసినట్లు తెలిపారు. కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అశోక్‌నాయక్, పృథ్వీరాజ్, సురేష్ గౌడ్, నర్సింహులు పాల్గొన్నారు.

'హెచ్ఆర్‌సీ' జిల్లా కార్యదర్శిగా ఖురేషి

నారాయణఖేడ్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ హ్యూమన్ రైట్స్ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎండీ.మైనోద్దీన్ ఖురేషి నియమితులయ్యారు. ఆదివారం ఖేడ్‌లోని సంస్థ ప్రాంతీయ కార్యాలయంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు బైండ్ల కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రహీం ఉత్తర్వులు జారీ చేశారు. మైనోద్దీన్ ఖురేషి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తున్నందున.. ఆయనను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ జిల్లా చైర్మన్ రాజ్‌కుమార్, న్యాల్‌కల్ మండల అధ్యక్షుడు నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ అందజేత

పుల్‌కల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండలం ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన గొల్ల ఆంజనేయులు అనారోగ్యానికి గురై సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్నాడు. మంత్రి దామోదర్ రాజనరసింహ సిఫారసు మేరకు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. ఈ మేరకు మంజూరైన రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మండల శివకుమార్ ఆంజనేయులు కుమారుడు భరత్‌కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు మాసగోని మల్లేశం, బి.రవి, జి.మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

చిచెత్త శుద్ధి ఏదీ..?

- నిరుపయోగంగా వర్మీ కంపోస్ట్ షెడ్లు
- రీసైక్లింగ్, ఎరువుల తయారీపై అశ్రద్ధ
- డంపింగ్‌యార్డుల్లేక కంపు.. కంపు



నిరుపయోగంగా వర్మీ కంపోస్ట్ షెడ్లు

నిజాంపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : 'చెత్త బండి వచ్చిందమ్మా.. తడి, పొడి చెత్తను వేరువేరు చేయండమ్మా' అన్న నినాదం ఎందుకూ పనికి రానిదైంది. ఇంటి ముంగిట చెత్తనైతే తీసుకువెళ్తున్నారు కానీ.. రీసైక్లింగ్ చేయడం లేదు. మెదక్ జిల్లా నిజాంపేట మండలం అంతటా గత ప్రభుత్వ హయాంలో కోట్లు ఖర్చుచేసి వర్మీ కంపోస్టు షెడ్లను నిర్మించారు. ఇవి కొన్నాళ్లు బాగానే నడిచినా.. ఇటీవల వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. దరిమిలా ఇళ్లలోని చెత్తను పంచాయతీ సిబ్బంది గ్రామ శివార్లలో ఎక్కడపడితే అక్కడ వేయడంతో కంపు కొడుతూ దుర్వాసన వెదజల్లుతోంది. చెత్త సేకరణపై అధికారులకు పట్టింపు లేకపోవడంతో స్వచ్ఛ గ్రామాల ప్రభుత్వం లక్ష్యం నీరుగారుతోంది.

కానరాని చెత్త శుద్ధి

విడివిడిగా తడి, పొడి చెత్తను సేకరించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంటింటికీ రెండు బుట్టలు అందించింది. మండలంలోని 14 గ్రామపంచాయతీల్లో డంపింగ్‌యార్డులు, కంపోస్టు షెడ్లుకల కట్టినా తడి, పొడి చెత్తను వేరు చేస్తున్న దాఖలు లేవు. అలాగే మండలంలోని పంచాయతీకి ఒకటి చొప్పున డంపింగ్‌యార్డులను ఆనుకుని చెత్త ఏరివేత షెడ్డు నిర్మించారు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.50 లక్షలు కేటాయించింది. కానీ డంపింగ్‌యార్డులో తడి, పొడి చెత్తను వేరుగా వేయాల్సిన సిబ్బంది.. రెండింటినీ కలిపి గ్రామ శివారులోకి తరలించి నిప్పు పెడుతున్నారు. దీంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా మారాయి. అలాగే చెత్తకు నిప్పు పెట్టడడం వల్ల వెలువడుతున్న వాసనతో వాయుకాలుష్యం ఏర్పడి ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి సేకరించిన చెత్తను రీసైక్లింగ్ చేసి పర్యావరణాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

రీసైక్లింగ్ చేయాలి



గ్రామాల్లో రూ.లక్షలు ఖర్చుచేసి నిర్మించిన డంపింగ్‌యార్డులను వినియోగంలోకి తేవాలి. అలాగే సేకరించిన చెత్తను తడి, పొడిగా వేరుచేసి డంపింగ్‌యార్డులో రీ సైక్లింగ్ చేయాలి. గ్రామ శివారులో చెత్త వేసి నిప్పు పెట్టడం వల్ల పొగతో ఇబ్బంది పడుతున్నాం. అధికారులు దృష్టిసారించి నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకోవాలి.

- మావురం రాజు, గ్రామస్థుడు

క్రీడలపై ఆసక్తి కనబరచాలి

● మాజీ మంత్రి చంద్రశేఖర్

● అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ విజేతగా సదాశివపేట



బాగారెడ్డి స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి డా.చంద్రశేఖర్, తదితరులు

జహీరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : క్రీడలపట్ల యువత ఆసక్తిని కనబరచాలని మాజీమంత్రి డా.చంద్రశేఖర్ పేర్కొన్నారు. జహీరాబాద్ పట్టణంలో ఆలిండియా బంజారా సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని గెలుపొందిన జట్లకు బహుమతులు, ట్రోఫీని అందజేసి మాట్లాడారు. యువత క్రీడల్లో పాల్గొనడంతో శారీరక ఎదుగుదలతోపాటు ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేపడుతూ యువతను ప్రోత్సహిస్తున్న శ్రీనివాస్‌నాయక్‌ను ఆయన అభినందించారు. ఇదిలా ఉండగా సదాశిపేట-జహీరాబాద్ జట్లు తలపడగా సదాశివపేటకు చెందిన ఫోర్టింగ్ టీంజట్టు విజయం సాధించింది. రన్నర్ జట్టుగా జహీరాబాద్ నిలిచింది. గెలుపొందిన జట్లకు నగదు, ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలు, బీఆర్ఎస్ అవినీతిపై పోరాడుతాం

● బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి



మహాసంపర్క్ అభియాన్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న గోదావరి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ హామీలు, బీఆర్ఎస్ అవినీతిపై పోరాడుతామని బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి అన్నారు. సంగారెడ్డిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమం కరపత్రాలను ఆదివారం ఆమె విడుదల చేసి మాట్లాడారు. ఈ నెల 4,5,6 తేదీల్లో ప్రతి బూత్ వారీగా ప్రతి ఇంటికి కరపత్రాన్ని చేరవేస్తూ స్టిక్కర్ అంటించి వారి సమస్యలు సేకరించి ప్రజల పక్షాన రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు విజయ్‌కుమార్, వాసు, గిరిధర్, ప్రవీణ్, పవన్ పాల్గొన్నారు.

గ్రామీణ వికాసం బీజేపీతోనే సాధ్యం

నారాయణఖేడ్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల వికాసం బీజేపీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఖేడ్‌లో బీజేపీ మహా సంపర్క్ అభియాన్ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పత్రిరామక్రిష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు దశరత్, నాయకులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతుంది

కొండాపూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మండల పరిధిలోని మారేపల్లిలో గ్రామశాఖ ఆధ్వర్యంలో మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శివ, ప్రభారీ సుధాకర్, కౌనిల్ సభ్యులు నరేశ్‌దేశ్‌పాండే, రాజేందర్‌రెడ్డి, అంజనేయులు, భూపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు



రేషన్‌కార్డుల మంజూరు పత్రాలను అందజేస్తున్న దారం శంకర్

నారాయణఖేడ్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : పార్టీలకతీతంగా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తుందని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్ అన్నారు. ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పేట 2,3 వార్డుల్లో కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులకు సంబంధించిన మంజూరు ఉత్తర్వులను ఆదివారం లబ్ధిదారుల ఇంటింటికి తిరిగి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ రేషన్‌కార్డులు అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింలు, ఉప్పరి రాములు, మహేష్, వీరేశం, ఏక్‌నాథ్ పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ, పోచమ్మ బోనాలు

రామచంద్రాపురం టౌన్/గుమ్మడిదల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : భారతీనగర్ డివిజన్ పరిధి బొంబాయి కాలనీ ఎల్లమ్మ పోచమ్మ ఆలయాల్లో బోనాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్యయాదవ్ పూజల్లో పాల్గొన్నారు. గుమ్మడిదల మున్సిపాలిటీ అన్నారం గ్రామ వార్డు పరిధిలో ఆదివారం బోనాలు నిర్వహించారు. బోనాలు సందర్భంగా పోతరాజు విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నా

బీసీ రిజర్వేషన్ల బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

నారాయణఖేడ్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ల బిల్లుకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కులగణన చేపట్టి అసెంబ్లీలో బిల్లును అన్ని పార్టీల మద్దతుతో పాస్ చేసి తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చి పార్లమెంట్‌లో బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించడానికి కేంద్రానికి పంపిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం ఉలుకు పలుకు లేని విధంగా వ్యవహరిస్తుందన్నారు. కేంద్రం స్పందించి చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో ఈనెల 5న పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలు వాయిదా తీర్మానం ఇవ్వనుండగా రాష్ట్రం నుంచి నాయకులు, ప్రజాప్రతినిధులు, బీసీలతో 6న డిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా, 7న రాష్ట్రపతి ద్రౌపతిముర్ముకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ధర్నా కోసం ఖేడ్ నుంచి 20 మంది కార్యకర్తలు తరలి వెళ్లనున్నారని వివరించారు.

వాకర్స్ సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్సీ



వాకర్స్‌తో కలిసి వాకింగ్ చేస్తున్న అంజిరెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : వాకర్స్ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ అంజిరెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్ వెనక పార్క్‌లో వాకర్స్‌తో కలిసి ఆదివారం ఉదయం పర్యటించారు. వాకర్స్‌తో కలిసి వాకింగ్ చేయడంతో పాటు షటిల్ ఆడారు. పార్క్‌లో ఓపెన్ జిమ్ సమస్యలను వాకర్లు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకొచ్చారు. అంతే కాకుండా ఇష్టానుసారంగా చెత్తాచెదారం పడేయడంతో దుర్వాసన వస్తోందని చెప్పారు. మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి పార్క్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మైదానంలో వాకర్స్ కోసం వాటర్ డిస్పెన్సర్ ఇస్తానని ఎమ్మెల్సీ అంజిరెడ్డి హామీ ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, నాయకులు తదితరులు ఉన్నారు.

బీసీ బిడ్డలకు బీజేపీతోనే న్యాయం : ఎమ్మెల్సీ

పటాన్‌చెరు ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ బిల్లు విషయంలో కాంగ్రెస్ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్సీ అంజిరెడ్డి చెప్పారు. పటాన్‌చెరు ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్ అమలు వ్యవహారాన్ని మతప్రాతిపదికన అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రయత్నం చేస్తోందని తెలిపారు. రిజర్వేషన్ అమలు విషయంలో గ్రామం యూనిట్‌గా విద్యావంతులు, గ్రామ పెద్దలతో చర్చించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు.

పజలు సుభిక్షంగా ఉండాలి

● ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి



బోనాల ఊరేగింపులో సునీతారెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి

వెల్దుర్తి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మహంకాళీ అమ్మవారి దీవెనలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి అన్నారు. మండల పరిధిలోని మన్నెవారి జలాల్‌పూర్‌లో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన బోనాలలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి పూజలు చేశారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

● ఎమ్మెల్యేను కోరిన బీమాక్ సొసైటీ కమిటీ సభ్యులు

రామచంద్రాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : బీహెచ్ఈఎల్ కార్మికులు నివాసముంటున్న బీమాక్ సొసైటీలో మిషన్ భగీరథకు కావల్సిన మొత్తాన్ని చెల్లించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సొసైటీ అధ్యక్షుడు శివనారాయణ అన్నారు. కాలనీలో చాలామంది రిటైర్డ్ ఉద్యోగులు, కొందరు పేదలు ఉన్నారని పేర్కొన్నారు. ఫలితంగా జలమండలి అడిగిన మొత్తాన్ని చెల్లించలేకపోతున్నామన్నారు. కాలనీకి త్వరగా తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మంగళవారం అన్ని నివేదికలతో క్యాంపు కార్యాలయానికి రావాలన్నారు.

మతోన్మాద విధానాలను తిప్పికొడదాం



మాట్లాడుతున్న జయరాజ్

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ అవలంబిస్తున్న మతోన్మాద విధానాలను కలిసికట్టుగా తిప్పికొడదామని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ అన్నారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నూతన ఆర్థిక విధానాలను వేగవంతంగా అమలు చేస్తున్నదన్నారు. కార్మికుల పొట్ట గొట్టి కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతున్నదని విమర్శించారు. ప్రజల మధ్య మతపరమైన విద్వేశాలను పెంచేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు.

ప్రజా సమస్యలపై పోరాటాలను తీవ్రతరం చేస్తాం

కొండాపూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత తీవ్రతరం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అతివేలు మాణిక్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం గంగారం గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై పర్యటించి మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, నిరుపేదలకు గత ప్రభుత్వాలు ఇచ్చిన ప్రభుత్వ భూములను వారికే నూతన పట్టాదారు పాసు పుస్తకాలను అందించాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో మండల కార్యదర్శి రాజయ్య సభ్యులు బాబురావు, ప్రవీణ్,అనిల్, సోలోమోహన్ పాల్గొన్నారు.

విశ్వశాంతికి పాదయాత్ర అభినందనీయం



శివాలయంలో పూజల్లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



వీరశైవలింగాయాత్ పాదయాత్రను ప్రారంభిస్తున్న నీలం మధు

పటాన్‌చెరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : విశ్వశాంతికై పాదయాత్రలు అభినందనీయమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు నుంచి గుమ్మడిదల బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయం వరకు వీరశైవ లింగాయత్ సమాజం ఆదివారం చేపట్టిన పాదయాత్రను ఆలయంలో పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యాంత్రికంగా మారుతున్న కాలంలో దైవసంబంధమైన పాదయాత్రలు అభినందనీయమని వివరించారు. ఇటువంటి యాత్రలను తప్పకుండా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పుష్పానగేష్, మెట్టు కుమార్‌యాదవ్, ఎండీఆర్ ఫౌండేషన్ చైర్మన్ పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వరుడి బోధనలు ఆచరణీయం

పటాన్‌చెరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : బసవేశ్వరుడి బోధనలు ప్రతి ఒక్కరు అనుసరించాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ నాయకుడు నీలం మధు అన్నారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలో ఆదివారం బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయం వరకు వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రను ప్రారంభించి మాట్లాడారు. బసవేశ్వరుడు చేసిన బోధనలు అనురిస్తూ సామాజికంగా మార్గదర్శకంగా మారుతున్నారని వివరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఆదిత్యారెడ్డి, రవి, దేవరాజ్ పాల్గొన్నారు.